# అతడి సాహసం

యం. యస్. మూర్తి

రామకృష్ణ లంచిహోం ప్రొప్రయిటరుకు ఎవడో కుర్రవాడు ఒక కవరు ఉత్తరం తెచ్చియిచ్చాడు. దాన్ని విప్పి ఆయన చదువుకున్నాడు. అందులో యిలా వుంది :—

'ఉభయ కుశలోపరి.

'మహాశయా, మీరు నన్ను ఎరగరు. కాని, నేను రోజూ మీ హోటల్లోనే టిఫిన్ తింటూంటాను. కొన్ని సంవత్సరాలుగా మిమ్మల్ని, మీ హోటల్ని సందర్శించని రోజంటూ లేదు, నా జీవితంలో—

'ఈ ఉత్తరం మీరు చూచుకునే వేళకి సరిగ్గా మీ హోటల్లో ఒక టేబిల్ కింద ఒక తాటాకుబుట్ట వుంటుంది – అది నేను మీ హోటల్లో బుద్ధిపూర్వకంగా విడిచి వచ్చాను. ఈ ఉత్తరంద్వారా ఆ సమాచారాన్ని మీకు తెలియజేస్తున్నా.

'ఆ తాటాకు బుట్టలో ఏముందో మీరు గ్రహించగలరా? వొద్దు, మీ తరపున నేనే గ్రహించి చెబుతా—

'హడిలిపోకండి – అందులో వున్నవి బాంబులుకావు – మూడు బ్రతికి వున్న పిల్లి పిల్లలు—

'ఇంకా మీకు అర్థం కాలేదనుకుంటా – నేనొక సామాన్య గృహస్థును – వృత్తి స్కూలుమేష్టరీ – జీతం యాభై రాళ్ళు – నా ఇంట్లోనే పిల్లల్ని పెట్టింది ఒక పిల్లి. ఇంకెక్కడా చోటు లేనట్టుగా—

'ఆ పిల్లల్ని విడిపించుకునే సామర్థ్యం నాకులేదు – పోషించే సామర్థ్యం అంత కన్నాలేదు. ఈ రేషనింగు రోజుల్లో – వీటిని ఏ వీధిలోనన్నా విడుస్తే, అవి పసికందులు – ఏ కుక్కో వాటిని చంపేస్తుంది – ఆ పాపం నాకు చుట్టుకుంటుంది–

'గట్టిగా ఆలోచించి, వాటిని గాలి తగిలే బుట్టలో పెట్టి, పొద్దున్న టిఫినుకు వచ్చినప్పుడు మీ హోటల్లో వుంచేసి వచ్చాను. మీరు వాటినిమిత్తమై ఏ విధమైన ఖర్చు, శ్రమ పడనక్కర్లేదు. వాటిని మీహోటల్లో వుండనిస్తే, బల్లలకింద దూరి వాటి బ్రతుకుదెరువు అవే చూసుకుంటాయి—

'నేను చేయలేని పాపాన్ని మీరు చేయరనీ, నేను చేయలేని పుణ్యాన్ని మీరు చేస్తారనీ భావిస్తూ శలవు తీసుకుంటాను.'